# గంపసంసారమ్

శ్రీ యస్. జి. ఆచార్య

ఏది సంసారం? మూడు అంతస్తుల మేడలో వున్నదేనా లేక పటకుటీరంలో వున్నది కూడా సంసారమేనా?- మరి చెట్టుక్రింద జీవించేవాళ్ళది,—అదీ సంసారమేనా?

ఉన్నదికదా అని అంతరిక్షాన జీవించేదీ—లేమితో బాధపడుతూ చిన్న చుట్టు గుడిశెలో జీవించేదీ- సమాజంలో రెండూ సంసారాలుగానే పరిగణించబడుతూ వుంటాయి. ఐతే ఆ రెంటినీ ఉన్న సంసారమనీ లేని సంసారమనీ అంటారు. తప్పితే రెండూ సంసారాలే!

*　　　*　　　*

సాధారణంగా చాలామంది వొక భ్రమలో పడి మాట్లాడుతూ వుంటారు; ఉన్నవాళ్ళ సంసారాలన్నీ సుఖప్రదమై హాయిగా వుంటవనీ, లేనివాళ్లు అందరూ లేమిలోపడి గిజగిజా తన్నుకలాడిపోతూనే వుంటారనీ వీళ్ల సంసారాలలో ఆనందమన్నది వుండనే వుండదనీ అనుకుంటారు.

ఈ అభిప్రాయంలో కొంత నిజం వుంటే వుండవచ్చు కాని యిది పూర్తిగా నిజమని యంటేమాత్రం నేను అంగీకరించను.

*　　　*　　　*

"ఆ కొంప చూస్తేనే భయం వేస్తుంది; అందులో యెలా సంసారం చేస్తున్నారో కాని" అని కొందరు విమర్శిస్తారు.

ఆ విమర్శకు ఆధారం తక్కువ. అనేకమంది "విమర్శకాగ్రేసరులు" పుస్తకాలను యెలా తప్పుపద్ధతిలో విమర్శ చేస్తారో అదే పద్ధతిలో తప్పుపద్ధతిలో సంసారాలను కూడా విమర్శ చేస్తూవుంటారంటాను. మహావేదాంతియైనవాడు శృంగార గ్రంథాన్ని పట్టుకుని యిటువంటి పుస్తకాలు వుండరాదని కొట్టిపారవేయడం యెంత సబబో,- ఒక తరహా సంసారాన్ని - దానితో పరిచయంలేని మరొకరు సానుభూతిలేకుండా కూడా విమర్శ చేయడం అంతే సబబు!

మనం విమర్శ చేసేటప్పుడు, మనకు ఆ సంబంధమైన పరిజ్ఞానం కొంత వుండాలి; సానుభూతీ వుండాలి; దానిలోని విశేషం యేమిటో తెలిసికుందామనే కుతూహలమూ వుండాలి. అంతేగాని మనం యేదో అంతిస్తుమీద కూర్చుని అదే కొలబద్ద అనుకొని యెదుటివారిని విమర్శ చేస్తూపోతే అలా చేసేవిమర్శ విమర్శ అనిపించుకోనే అనిపించుకోదు! అసలు ఆరంభంలోనే కాంసపాదవేసి మరి గుడ్డియెద్దు చేనిలో పడ్డట్లు పోవడమే అనిపించుకొంటుంది.

*　　　*　　　*

సుఖదుఃఖాలన్నవి అన్ని తరహాల సంసారాలలోనూ వుంటవి. సుఖాలన్నీ వొకరివీ, దుఃఖాలన్నీ యింకొకరివీ యన్నట్లు గుత్తగొన్నట్లుగా యెవ్వరూ జీవించరు. ఇవ్వాళ వొక సంసారం తీరని దుఃఖంలో మునిగిపోవచ్చు; అదే సంసారం ఆ తరువాత అనంతమైన ఆనంద పారవశ్యత పొందవచ్చు. కనుక మనం పాఠాలు నేర్చుకోవాలనినా - మానవజీవనానికి సంబంధించిన అనేక సమస్యలను పరిశీలించవలెననినా చిన్న పెద్ద సంసారాలన్నింటినీ పరిశీలించవచ్చు. మనం చేసే ఆ పరిశీలన యేదోవొక విధమైన అంశంతో పరిచయం చేస్తుందే తప్పితే వృధాకాదు. అందువల్ల విశాలప్రపంచం వొక మహావిద్యాలయంగా, దానిలోని ప్రతీ సంస్థా వొక విజ్ఞానకేంద్రంగా - సుఖదుఃఖాలతో పరిచయం చేయగల వ్యవస్థగా తీసుకుందాము. ఇటువంటి సమాధానంతో చిత్తం పెంపొందించుకోగలిగిన మీరు యిక నాతో యెక్కడపడితే అక్కడకు రావచ్చు; నేను చూడగలిగే దృశ్యాలను సానుభూతితో మీరూ చూడగలరు. అనేక ఘట్టాలలో అనేకమంది అనుభవించే ఆ యానందాన్ని నేనూ నాతోబాటు మీరూ ఆనందించగలరు.

ఇప్పుడంటే పట్నవాసపు జీవనం అలవాటయిపోయింది కాని బాల్యావస్థ అంతా పల్లెసీమలలోనే—అందులోనూ మన్యపు ప్రాంతాలలోనే గడిచింది. అందువల్ల ఆ చిన్నతనంలో నన్ను మొదటిమారు ఆకర్షించిన సంసారశోభ గురించి చెప్పనీయండి.

బస్తీలలో వేసవి రాకముందే మన్యపు ప్రాంతంలో వేసవి ప్రవేశిస్తుంది. ఇక్కడ హుస్సు బుస్సుమంటూ ఉక్కతో నలిగిపోతూవుంటే, అక్కడ మన్యపు ప్రాంతంలో ఉహుహూ అంటూ వొణికించే చలి ప్రారంభం ఔతుంది.

ఒకవిధమైన 'డాలు యెండ.' ఆ ఎండ కాస్తంత వేడిగానే వున్నట్లు వుంటుంది కాని వెన్ను నానుకుని కొంచం చలి శరీరానికి అదొక తరహాగా గిలిగింతలు పెడుతూ వున్నట్లుగా వుంటుంది. అటువంటి శీతోష్ణస్థితిలో సైకిలు త్రొక్కుతూ వుండడమంటే మహా సరదాగా వుండేది.

నాన్నగారు పనిచూచుకొని వచ్చి భోజనంచేసి విశ్రాంతి తీసుకునే సమయమూ—, నేనూ సైకిలు యెక్కి వొంటరిగా కొండలప్రక్కన పోయే రోడ్లవెంట నెమ్మదిగా సైకిలు షికారు వెళ్ళే సమయమూ వొకటే.

నేను ఆనాడు వెల్లిగానే సైకిలు త్రొక్కుకుంటూ బయలుదేరినా యెండవల్లనో త్వరలోనే అలసిపోయాను. దానితో మరి మొండిగా ముందుకు వెళ్లి అలసిపోవడంలో ఆనందం లేదనుకుని లింగంపర్తి తిమ్మరాజుచెరువుగట్టునవున్న లేత మునిడి చెట్టు నీడను కూర్చున్నాను.

తిమ్మరాజుచెరువు ఒక విచిత్రమైన జలాశయం. దానిలోని నీళ్లు నల్లగా వుంటాయి. వాటికి యెప్పుడో కాని చల[illegible] వుండదు. మూడు వైపుల కొండలే గట్లుగా గలిగి వొకేప్రక్క పోతగట్టుగల ఆ చెరువు ప్రశాంత వాతావరణానికి ఆటపట్టు.

నేనా గట్టుమీద పరుండి అనేకమారులు అనేక విచిత్ర భావాలకు గురియాతూ వచ్చాను. ఒక్కొకమారు ఆ ప్రశాంత వాతావరణమే నన్ను భయపెట్టేది. కొన్ని కొన్ని సమయములలో—యిక్కడ గల నిశ్శబ్దత మరొకచోట అనుభవించడానికి వుంటుందా అని నా మనసులో నేను మెచ్చుకొనేవాడను. గట్లుగావున్న ఆ మూడు కొండలు చూచీ, వాటి ముందు యేదో చిన్న బొమ్మరిల్లు గోడవలె కనిపించేగట్టు చూచీ - యీ గట్టును పొర్లి యీ చెరువు ప్రవహిస్తే యేమి కాదనే భావం కలిగినప్పుడు నిజంగా భయమే వేసేది; ఒకనాడు హటాత్తుగా కొండల మీద కారు మేఘాలు ఆవరించగా యిక

(52-వ పేజీ చూడండి)



# గంపసంసారమ్

(6-వ పేజీ తరువాయి)

నా ప్రాంతం నా మీదనే ఆగ్రహించినట్లుగా అదరిపోయి సైకిలుమీద పడి అదే పరుగుతీయడము తీశాను. విచిత్రమేమంటే- వొకే స్థలం వొకే వ్యక్తిమీద యెన్ని రకాల ప్రభావం కలిగివున్నదో చూచారా!

కాని ఆనాడు అలసివున్న నాకా చెరువుగట్టుమీది ఆ ముసిడి చెట్టునీడ యెంతో హాయినిచ్చింది. చెరువులో నీరు కదలడం లేదు. చెట్టు ఆకులూ కదలడం లేదు. కాని ఎర్రని ముసిడిపళ్ళు యెంతో ముచ్చటగా కనుపించాయి. గట్టిపడిన రేగడి మంటి గట్టుమీద వెలకిలా పడుకొని ఆకాశం వైపు చూస్తున్న నాకు - ఆ సమయంలో అంతకు మించిన హాయి నీయగల చోటు వుండనే వుండదనిపించింది.

ఆ సుందర ప్రశాంతి వాతావరణం నా హృదయానికి గిలిగింతలు పెడుతూవుంటే ఆ ఉత్సాహాన్ని పదింతలు పెంచడానికో యన్నట్లుగా - ఎదురుచూడ వీలులేని పిల్లన గ్రోవిస్వనాలు వినిపించాయి. నాకు ఆశ్చర్యమే వేశింది. ఏమా అని కొంచం తలయెత్తి చూచాను. ఆ శ్రావ్యధ్వనికి తోడు గల్లుగల్లుమనే మువ్వలు కావు కాని, యించుమించు అదే శబ్దాలు చేసే - పూసలు గవ్వలు - ధ్వని వినవచ్చింది.

లేచి కూర్చున్నాను. ధ్వనివస్తున్న దెస చూచాను. క్రమేణా పదాల సవ్వడి వినవచ్చింది. లేత కంఠంకూడా మెల్లిగా వినవయింది. చూచాను; ఆ పిల్లనగ్రోవి వూదుతున్నది వొక పాతిక సంవత్సరాల చెంచు. అతనివెంట నాలుగైదుయేండ్ల బాలిక. అతనివెనుక నెత్తిమీద పెద్ద గంప పెట్టుకొని ఉత్సాహంగా అడుగులు వేస్తున్న స్త్రీ. ఆమె చంక నొక పాపాయి వ్రేలాడుతున్నది.

ఆ ప్రాంతంలో వాళ్ళూ నేనూ; మరెవరూ లేరు. నేను వాళ్ళనే చూస్తున్నాను. వాళ్ళూ నాకురించే అనుకుంటూను, మాట్లాడుకుంటున్నారు.

నేనున్న ముసిడిచెట్టుప్రక్కనే వరుసగా వంగివున్న మూడు యీతిచెట్లనీడను వారాశ్రయించారు.

ఆమె తలమీది గంపను అతడు దించాడు. మొలనున్న తాటాకు సంచిలోనుంచి యిన్ని పిట్టలను చేతపుచ్చుకున్నాడు. రెండో మూడో ఆమె చెంతి వదలి మిగిలిన వాటిని తీసుకుని వడివడిగా వెళ్ళిపోయాడు యువకుడు.

నా కర్థమయింది ; అతడు భర్త ; ఆమె భార్య ; ఆ యిరువురూ వారి సంతానం.

భర్త వెళ్ళగానే ఆమె యిన్ని రాళ్ళను ప్రోగుచేసింది. యిన్ని చిదుకులు యేరింది. పొయ్యి రాజేసింది. నేల పడివున్న పిట్టలను శుభ్రం చేసింది ; నిప్పుసెగను కాల్చింది.

తరువాత గంపమీది గోనెబరకా తీసి క్రింద పరచింది. పాపలను పండబెట్టింది. గంపలోనుంచి చట్టెలు తీసింది. ముక్కలు కోసిన పిటలను వాటిలో వేసింది. యింత ఉప్పు యితరవస్తువులు యేవేవో వేసింది. మూత పెట్టింది. ఆమెకూడా ఆ పాపల ప్రక్క నిద్రపోయింది.

అరగంటలో పిట్టలతో ఏలేశ్వరం వెళ్ళిన చెంచుయువకుడు తిరిగి వచ్చాడు. భుజంమీదినుంచి చిన్న బుంగ దించాడు. వెదురుగొట్టం జాగ్రతగా భార్యకు అందించాడు. దారిలో దొరికిన పండు అంటూ వొక చలితాటిపండు భార్య కిచ్చాడు.

చెంచువాని భార్య బుంగలోని ముతుక బియ్యం తీసి కడిగి కుండలోబోసి పొయ్యి మీద పెట్టింది. వెదురు బొంగులోని నూనెను పిట్టల చట్టిలో పోసి కలిపి, పొయ్యి కి మరొకపొక్కిలి అమర్చి సన్నని మంట మీద పెట్టింది. అవి మెల్లిగా ఉడుకుతూ వుంటే తాటిపండు చిదుగగొట్టి ముగ్గురూ మూడు టెంకలూ చీకుతూ తమాషాగా తృప్తిగా హాయిగా కబుర్లు చెప్పుకొంటూ కూర్చున్నారు. ఆ దృశ్యం నాకెంతో ఆనందాన్ని యిచ్చింది.

ఆడపిల్ల తాటిటెంక చీకుతూ గంతులు వేస్తూ ఆడుకొంటూవుంది. స్త్రీ యెడమ చేతిలోని పుల్లతో కుండలోని కూటినీ, చట్టిలోని కూరనూ కలుపుతూవుంది. ఇంతలో తప్ మని శబ్దం కాగా ఆడుతూ వున్న పిల్ల నీటివైపు పరుగెత్తింది.

నాకు భయం వేసింది. చటుక్కున లేచాను.

నా ఆవేదన చూచిన ఆ చెంచు నవ్వుతూ "బాబుగారికి భయం అక్కర్లేదు. అది నీట్లో దిగదండి, దిగినా జల్లలా యీదగలదండి" అన్నాడు.

నేను యింకా చూస్తూవున్నాను. ఆ పిల్ల పరుగున వెళ్లింది. ఎందుకా అనుకొంటూ


కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో., రాజమండ్రి

32 సంవత్సరముల అనుభవముగల
రెడ్డి అండ్ కో., వారి
(రిజిష్టర్డు)
కుష్ఠు, బొల్లి, సుఖరోగాది
చికిత్సలకు నేడే సంప్రతించండి.
నకలుమందులు చూసి మోసపోకుడు.
అన్నిభాషలలో కేట్లాగు ఉచితము.
హెడ్ ఆఫీస్: రెడ్డి అండ్ కో.,
గోపాలపురం.
(తూర్పుగోదావరి)
బ్రాంచిలు:- నెల్లూరు, బెజవాడ, రాజమండ్రి
సికింద్రాబాద్, విశాఖపట్నం, బరహంపురం
మొదలగు పట్టణములలో.


గర్భామృతము
సమస్త
గర్భాశయ రోగములకు
అద్భుతముగా పనిచేయును
మోడల్ ఫార్మశీ, విజయవాడ.

బూట్ల షాపులోకి ఒకడు వెళ్లి తనపాదం కంటె బాగా చిన్నబూట్లు ఎంచి తీశాడు. షాపు మనిషి "ఇవి మీకు సరిపోవు సార్," అన్నాడు.

"సరిపోవు కనకనే తీసుకున్నాను. నాకు జీవితంలో సుఖమనేది లేదు. ఆఫీసులో అధికారి బాధ బయట అప్పుల బాధ, ఇంట్లో పెళ్లాం బాధ, మంచం మీద నల్లులబాధ- అన్నీ బాధలే. నాకు మిగిలినది-ఆఫీసు నుంచి ఇంటికి వెళ్లి ఇరుకు బూట్లు విప్పుకున్నప్పుడు వచ్చే సుఖం ఒక్కటే.

వుండగానే నీటిలోనుంచి గట్టు మీదకు త్రుళ్లిపడిన మూరెడు చేప—, తిరుగా నీటిలోకి దొర్లిపోకముందే చెంగుమని దూకి వెళ్లి పట్టుకొని తీసుకువచ్చింది ఆ పిల్ల.

ఆ చేప ప్రాణంతోనే వుంది. దానిని పిల్ల తల్లికి యిచ్చింది. "రేపు కూరకి" అంటూ ఆ చేప నామె అందుకుని కుమార్తె తెలివికి ఆమెలో ప్రేమ ఉప్పొంగగా ముద్దు పెట్టుకున్నది.

ఫలహారం అయింది. పొయిలోని చిదుకులూ ఆరిపోనున్నవి. స్త్రీ వడివడిగా చేప పొట్టను చీల్చింది. ముక్కలు కోసింది. ముంగలో యింకా వున్న ఆ కొద్దిపాటి రూపెతో మరొక చట్టిలో వేసి సిద్ధపరచింది.

పొయ్యిమీది పాత్రలు దించింది. చేప ముక్కలు చట్టెను దానిమీద బెట్టి సన్నని సెగ యొగదోసింది.

స్త్రీ గంప తడిమింది. గంపలోనుంచి - చిల్లులుపడిన పాత పింగాణీ చిప్పలు మూటిని యెదుటపెట్టింది. వండినదానిని వాటిలో వడ్డించింది. నేనంతా చూస్తూ వున్నాను.

ఇంతలో ఆ దంపతులు లోలోన యేమో మాట్లాడుకున్నారు. ఆ యువకుడు నన్నుద్దేశించి 'ఆజ్ఞ యిప్పిస్తారా' అని అర్థమయేట్లు అన్నాడు. అది మర్యాదకాబోలునని గ్రహించి కావివ్వమన్నాను

యువకుడు ఒక పిడికెడన్నము ఆ చెరువులో విసిరాడు. ఆ మెతుకులకని చెరువులోని చేపలు కొంచము శబ్దము చేశాయి.

ఆ దంపతులు, వారి అమ్మాయి - ఆ యీతచెట్లనీడలో ఆ వండుకున్నదాన్ని యెంతో తృప్తిగా తింటూవుంటే నాకేమో పరిపరి విధాల పోయింది మనసు! ఇంత తృప్తిగా తింటున్నారంటే కారణం ఆమె అంత చక్కగా వంటచేయగలిగిందా, లేక వాళ్ళకు అన్నముయొక్క రుచితో అవసరంలేనియంత ఆకలి వున్నదా - అనుకున్నాను. ఆ ముగ్గురూ తింటూ కులాసాగా కబుర్లు చెప్పకుంటూ వున్నారు. మన ఇళ్ళలో కాలి తడియారకుండా తిని లేచిపోవాలంటారేగాని, యింత తీరికగా, ఆనందంగా తినడానికి వీలేవుండదు గదా అని విచారించాను.

చట్టీ ముండా రెండూ ఖాళీయైపోయినవి. స్త్రీ ఆ రెంటినీ చెరువులో కడిగి గట్టు మీద ఆరబెట్టింది. పొయ్యిమీది చట్టి దింపి మూతబెట్టి గంపలో భద్రపరిచింది. క్రింద పరచిన గొంగళిమీద అంతా హాయిగా విశ్రమించారు.

నాకా సంసారం యెంతో ముచ్చటగా కనుపించింది; అనిపించింది. వాళ్ళు నిద్రపోతూవుంటే నేను కూర్చునే చూస్తున్నాను.

నాలుగు గంటలకు లేచారు. ఆమె గంప సర్దుకున్నది. ఇక ప్రయాణమయేలా వున్నారు. నేనా చెంచుతో ముచ్చటించాలనే అంతసేపూ వుండిపోయాను.

చెంచు నాదగ్గరకు వచ్చాడు. అతనిని అనేక ప్రశ్నలు వేశాను. వాళ్ళది సంసారం. గంప సంసారం. భార్య మోసే ఆ గంపలో వున్నదే వారి సర్వస్వమూను. పిట్టలను కొట్టడం, వాటిని అమ్మడం, అమ్మగా వచ్చినదానితో గింజలు నూనె సంబారాలు - అంతకు మించి రావట. అంతకుమించి వాళ్ళకు యేమీ అవసరం లేదట. "బతకడానికి పొట్టకు యేదో యింత కావాలి బాబూ, అదేదో దొరుకుతున్నది. ఇవ్వాళ యిక్కడ, సాయంత్రానికి పక్కవూరు చేరుకుంటాం బాబూ," అంటూ ఆ చెంచు చెప్పాడు.

వారిది గంప సంసారం. ఐనా వారికి దానిలో ఆనందం వుంది. హాయి వుంది; తృప్తి వుంది. వారి జీవితంలో పరమ వేదాంతం వుంది. సహజత వుంది.

ఆ గంప సంసారానికి కుటీరం లేదు; ఆస్తి లేదు; ఒకచోటు కాపురమని లేదు ఐనా ఆనందము, తృప్తీ వున్నాయి ఇదే గదా సుఖసంసారానికి కావలసిన వసు అనుకుంటూ ఆ తరువాత సైకిలుమీద యిల్లు చేరాను. ★


## నపుంసకతైలం

అంగ, నరములు బలహీనతచెంది చిన్నదైన తిరి యధాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 48 ఏండ్లు ప్రఖ్యాతిచెందిన గ్యారంటీమందు 1 సీసా రూ 10/- వి. పి. రూ 1 0 0.

## గర్భనిరోధిని

అనేక వేలమందిచే వాడబడి, నమ్మకంగా గుణంయిచ్చినదని నిర్ధారణ అయినమందు సంతాన నిరోధమునకు ప్రభుత్వంవారుకూడా ప్రచారముచేయుచున్నారు శరీరారోగ్యమునకు ఏమాత్రం భంగంలేని 48 సంవత్సరములు ప్రఖ్యాతి గలమందు స్త్రీలు బహిష్టు సమయములో సేవించిన యికమీదట గర్భమురాదు. 1 సీసా రు 10/-లు. వి. పి. ఖర్చు రు 1/- కావలసినవారు రు 1/- ముందుగా పంపేది

డాక్టర్ రత్నం సన్సు మెడికల్ హాల్, మలకపేటబిల్డింగ్సు. హైద్రాబాదు (దక్కన్)



చిన్నపిల్లల లివర్ ప్లీను వ్యాధులకు



# జమ్మివారి లివర్‌క్యూర్

ఇప్పుడు మాత్రల రూపంలో దొరుకుతున్నది

జమ్మి వెంకటరమణయ్య అండ్ సన్స్
మైలాపూరు, మద్రాసు-4

బ్రాంచిలు : ఓరుగంటివారివీధి, విజయనగరం సిటీ, 5-ఏ కమలానగర్ (జి టి రోడ్డు, సబ్జిమండి) ఢిల్లీ